సాక్షి శ్రీకాకుళం

గురువారం ; 15 ; ఆగస్టు ; 2024



త్యాగాలకు సలాం

స్వాతంత్య్ర స్ఫూర్తిని సిక్కోలు కొనసాగిస్తోంది. గాంధీ మందిరాలు, స్మారక స్థూపాలు, స్మృతివనాల ఏర్పాటు చేసి పోరాటయోధులకు నివాళులు అర్పిస్తోంది.

- IIలో



స్వాతంత్య్ర వేడుకలకు సిద్ధం

స్వాతంత్య్ర వేడుకలకు శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానం సిద్ధమైంది. ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేయనున్నారు.

- IIలో

కొనసాగుతున్న పీజీ కౌన్సెలింగ్

ఎచ్చెర్ల క్యాంపస్: ఏపీ పీజీ సెట్ -2024 కౌన్సెలింగ్ కొనసాగుతోంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం, అఫిలియేషన్ కళాశాలల్లో చేరే విద్యార్థులు రిజిస్ట్రేషన్, ఆన్‌లైన్ సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరుకావాల్సి ఉంటుంది. ఈ నెల 19 వరకు ఆప్షన్లు ఇచ్చుకోవాలి. 28న సీట్లు అలాట్ చేస్తారు. 29 నుంచి 31 మధ్య రిపోర్టు చేయాల్సి ఉంటుంది. 29 నుంచి క్లాస్ వర్కు ప్రారంభమవుతుంది.

న్యూస్‌రీల్

డిగ్రీ నాలుగో సెమిస్టర్ ఫలితాలు విడుదల

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ నాలుగో సెమిస్టర్ ఫలితాలను ఎగ్జామినేషన్స్ డీన్ ఎస్.ఉదయ్‌భాస్కర్ బుధవారం విడుదల చేశారు. 6823 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 3129 మంది పాసయ్యారు. 45.86 శాతం ఉత్తీర్ణత నమోదైంది. జ్ఞానభూమి పోర్టల్‌లో ఫలితాలు అందుబాటులో ఉంచారు. బీఏలో 784 మందికి 466 మంది, బీబీఏలో 113 మందికి 98 మంది, బీసీఏలో 190 మందికి 160 మంది, బీకాంలో 1157 మందికి 455 మంది, బీఎస్సీలో 4579 మందికి 1950 మంది ఉత్తీర్ణత సాధించారు. రీవాల్యుయేషన్‌కు 15 రోజుల్లో దరఖాస్తు చేసుకోవాలని, డిగ్రీ ఇయర్ ఎండ్ బ్యాచ్ స్పెషల్ డ్రైవ్ పరీక్షకు ఈ నెల 21లోపు దరఖాస్తు చేసుకోవాలని డీన్ సూచించారు.

జోగి రమేష్ కుటుంబంపై కక్ష సాధింపు తగదు



ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట: మాజీ మంత్రి జోగి రమేష్ కుటుంబంపై అధికారం అడ్డు పెట్టుకొని కూటమి నేతలు కక్ష పూరితంగా వ్యవహరిస్తున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చట్ట ప్రకారమే భూమిని కొనుగోలు చేసి రమేష్ కుటుంబం విక్రయించిందన్నారు. దీనిలో తప్పులు జరిగాయని, చట్టాన్ని ఉల్లంఘించారని కేసులు నమోదు చేయడం, రమేష్ కుమారుడిని అరెస్టు చేయడం శోచనీయమన్నారు. ఏసీబీ అధికారులతో తనిఖీలు చేయించడం కక్ష సాధింపేనని, మాజీ మంత్రి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని చెప్పారు. ఇటువంటి కేసులకు భయపడాల్సిన పనిలేదన్నారు.

దేశభక్తిని చాటేలా హర్ ఘర్ తిరంగా



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. జాతీయ సమైక్యతను చాటి చెప్పేలా ప్రతి పౌరుడు ఇంటిపై ముువ్వన్నెల జెండా ఎగురవేయాలని కోరారు. బుధవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అనంతరం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా టూరిజం అధికారి నారాయణరావుతో కలిసి అధికారులకు పలు సూచనలు జారీ చేశారు. అన్ని పాఠశాలల్లో పిల్లలతో ప్రతిజ్ఞ చేయించి జాతీయ జెండాలను చేత పట్టి ర్యాలీలు నిర్వహించాలని, వాటి ఫోటోలను తీసి హర్ ఘర్ తిరంగా వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని జిల్లా విద్యా శాఖాధికారికి సూచించారు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో ప్రతి పంచాయతీలో జాతీయ సమైక్యత పోటీలు నిర్వహించాలన్నారు. డ్వాక్రా మహిళలతో కూడా జెండాలతో ర్యాలీలు నిర్వహించాలని డీఆర్‌డీఏ పీడీ కల్యాణ చక్రవర్తికి సూచించారు. ప్రధాన కూడళ్లు, అన్ని ఇంజినీరింగ్ కళాశాలల్లో సెల్ఫీ పాయింట్లను ఏర్పాటు చేయాలన్నారు. స్వాతంత్య్ర సమర యోధుల కుటుంబ సభ్యులను, మాజీ సైనికులను గురువారం ఉదయం మంత్రి సన్మానిస్తారని, సాయంత్రం ప్రముఖులను ఆహ్వానించి దేశభక్తి గీతాలతో కూడిన సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు.

సెప్టెంబర్ 14న లోక్ అదాలత్



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

శ్రీకాకుళం పాతబస్టాండ్: సెప్టెంబర్ 14న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కరించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ అధ్యక్షుడు జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. జిల్లా కోర్టు భవనంలో బుధవారం ఇన్సూరెన్సు కంపెనీలు, న్యాయవాదులు, బ్యాంకర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీపడదగ్గ క్రిమినల్, సివిల్, బ్యాంకు సంబంధించిన కేసులను పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, న్యాయవాదులు వై.సూర్యారావు, ఎల్.గోవిందరాజులు, ఎం.జనార్దన,బి.ఎస్.చలం, కె.జీవరత్నం పాల్గొన్నారు.



శ్రీకాకుళంలో ర్యాలీగా వెళ్తున్న కలెక్టర్, ఎస్పీ, జేసీ తదితరులు



కంచిలి: అంపురం జంక్షన్‌లో జాతీయ జెండా రంగులతో దోసె వేసి సెల్యూట్ చేస్తున్న చెఫ్ సుదర్శన్

టెక్కలి: 320 అడుగుల జాతీయ జెండాతో టెక్కలిలో ర్యాలీ



ముువ్వన్నెల దారుల్లో..!

స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా బుధవారం శ్రీకాకుళం అంబేడ్కర్ కూడలి నుంచి ఏడు రోడ్ల కూడలి వరకు హర్ ఘర్ తిరంగా చైతన్య ర్యాలీ నిర్వహించారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ మహమ్మద్ ఖాన్, పోలీసులు, రెవెన్యూ, మున్సిపాలిటీ, ఇతర విభాగాల అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. జాతీయ సమైక్యతను కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని వక్తలు పిలుపునిచ్చారు.

– శ్రీకాకుళం క్రైమ్

చికిత్స కాదు.. చుక్కలు చూపిస్తున్న రిమ్స్

- జిల్లా పెద్దాస్పత్రిలో తప్పని కష్టాలు
- అభ యాప్‌తో రోగులకు ఇక్కట్లు
- పనిచేయని ఫ్యాన్లు, ఏసీలు, లిఫ్టులు
- శ్రీకాకుళం రిమ్స్‌లో 'సాక్షి' విజిట్

సాక్షి గ్రాండ్ రిపోర్ట్

జిల్లా మొత్తానికీ పెద్దాస్పత్రి ఒక్కటే పెద్ద దిక్కు. బీదాబిక్కీ జనానికి ఏ కష్టం వచ్చినా పరుగు పరుగున ఇక్కడకే వస్తారు. దేవుడి కంటే ఎక్కువగా ఇక్కడి వైద్య వ్యవస్థనే నమ్ముతారు. కానీ ప్రభుత్వం మారిన తర్వాత ఈ పెద్దాస్పత్రికి 'పర్యవేక్షణ లోపం' అనే జబ్బు చేసింది. చదువురాని ఓ గ్రామీణ ప్రాంత రోగి, సహాయకుడు ఆస్పత్రికి వస్తే.. చికిత్స సంగతి తర్వాత.. ఓపీ తీసుకోవడానికి కూడా నరకం చూడాల్సిందే. దీనికి తోడు అభ యాప్ వల్ల కూడా ఆపసోపాలు తప్పడం లేదు. ఆస్పత్రిలో కూడా చాలా గదుల్లో ఫ్యాన్లు తిరగక, లిఫ్టులు పనిచేయక రోగులు ఇబ్బంది పడుతున్నారు. వైద్యులు వచ్చిపోయే సమయాలు కూడా అస్పష్టంగా ఉంటూ వారి సహనానికి పరీక్ష పెడుతున్నాయి. సోమవారం 'సాక్షి' ఆస్పత్రిలో విజిట్ నిర్వహించింది. గత ప్రభుత్వంలో ఎదురుకాని చాలా సమస్యలు ఇప్పుడు ఉత్పన్నమవుతున్నట్లు తెలిసింది.

– శ్రీకాకుళం, అరసవల్లి, శ్రీకాకుళం క్రైమ్

ఓపిక ఉండాల్సిందే..: రిమ్స్‌లో ఔట్ పేషెంట్ విభాగం వద్ద పరిస్థితి



సమయం: ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు

ప్రాంగణం: రిమ్స్ (సర్వజన ఆస్పత్రి), అవుట్ పేషెంట్ (ఓపీ) విభాగం



అంతంతమాత్రమేనా..

- ఓపీ తీసుకుని వైద్యుడి వద్దకు వెళ్లాక ఆయన రాసిన మందులు తీసుకోవడానికి కూడా రోగులు ఇబ్బంది పడే పరిస్థితి కనిపించింది.
- మందులిచ్చే కౌంటర్‌కు మందుల చీటీ ఇస్తే.. సగానికి సగం మందులు దొరకని పరిస్థితి నెలకొంది.
- ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సుమారు 82 మందికి మందులు రాసిస్తే.. 11 మందికి మాత్రమే పూర్తిస్థాయిలో మందులు ఇచ్చారు.
- ముఖ్యంగా కార్డియాలజీ, గైనిక్‌కు సంబంధించిన రోగులకు ఈ మందుల కొరత ఇబ్బందులకు గురి చేసింది.
- దీంతో బయట కొనక తప్పలేదు.
- ఇక్కడ దొరకని మందులు రాసేస్తున్నారని కొందరు ఆరోపించడం గమనార్హం.



ఒకవైపే స్త్రీలకు, పురుషులకు మందులిస్తున్న దృశ్యం

ఓపీ వద్ద పరిస్థితులు ఇలా..

- ఉదయం మొదలుకుని ఆస్పత్రికి వందలాదిగా రోగులు చేరుకున్నారు.
- ఇదివరకుతో పోల్చుకుంటే రిమ్స్‌లో ఔట్ పేషెంట్ల సంఖ్య బాగా తగ్గింది.
- గతంలో 500 నుంచి 600 వరకు ఓపీ ద్వారా చికిత్సలు పొందారు. సోమవారం 375 మంది మాత్రమే ఓపీ ద్వారా రిజిస్టర్ చేయించుకుని చికిత్సలు పొందారు.
- అయితే అభా యాప్‌లోని కష్టాల వల్లనే రోగుల సంఖ్య తగ్గుతోందని సిబ్బందితో పాటు వైద్యులు కూడా చెబుతున్నారు.
- సోమవారం సాయంత్రం 5 గంటల వరకు వంద మంది ఇన్‌పేషెంట్లుగా చేరారు.

అభ యాప్‌తో అపసోపాలు



ఓపీ ఆన్‌లైన్ ఎన్‌రోలింగ్‌లో ఓటీపీ కోసం పాట్లు

- నేషనల్ హెల్త్ అథారిటీ వారి ఆదేశాలనుసారం రాష్ట్ర వ్యాప్తంగా అమల్లోకి తెచ్చిన అభ (ఏబీహెచ్‌ఏ) ఓపీ యాప్‌తో రోగులకు ఇబ్బంది తప్పడం లేదు.
- ఆధార్ కార్డుతో పాటు లింక్డ్ ఫోన్ ఉంటేనే ఓటీపీ ద్వారా ఓపీ నంబర్ ఖరారయ్యే ఈ విధానంతో గ్రామీణ ప్రాంతాల వారు, వృద్ధులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.
- సోమవారం పరిశీలనలో చూస్తే.. ఉదయం 9 గంటలకు యాప్‌లో పేరు నమోదు చేస్తే.. 10 గంటల వరకు నంబర్ అలాట్ కావడం లేదు.
- తర్వాత మళ్లీ రోగులు క్యూ కట్టి ఓపీ నంబర్ ప్రకారం రోగానికి తగిన విభాగ గదిని ఖరారు చేసుకోవాల్సి ఉంటుంది.
- అభ యాప్‌ను వినియోగించి ఓపీ రశీదును ఇచ్చేందుకు మూడు నాలుగు చోట్ల సిబ్బందిని నియమించినప్పటికీ.. సెల్‌ఫోన్ లేనివారిని ఏ మాత్రం కనికరం కూడా లేకుండా పంపించేస్తున్న దృశ్యాలు కనిపించాయి.

సెలవులకు నెలవు

- ఆస్పత్రిలో వైద్యులు 269 మందికి గాను 25 మంది సెలవులో ఉన్నారు.
- కొంతమంది దీర్ఘకాలిక సెలవులో ఉన్నారు.
- గత ప్రభుత్వం వైద్యులకు పదోన్నతి కల్పించడంతో సుదూర ప్రాంతాల నుంచి శ్రీకాకుళం వచ్చిన వారు తరచూ సెలవులు పెట్టడం, విధులను త్వరగా ముగించుకుని వెళ్లిపోవడం వంటివి చేస్తున్నారని ఆస్పత్రిలో ఉన్న కొంతమంది ఉద్యోగులే చెబుతున్నారు.

అత్యవసరం అన్న వేళ కూడా..



ఆత్మహత్యకు పాల్పడ్డ పుటాపు అప్పలదాసును ఐసీయూలో బెడ్‌లు లేవంటూ ఎమర్జెన్సీలోనే ఉంచేస్తూ..

రిమ్స్‌లో ఎమర్జెన్సీకి వచ్చే రోగులపై నిర్లక్ష్యం చూపిస్తున్నారని తెలిసింది. లావేరు మండలం కొంక్యాం గ్రామానికి చెందిన ఓ రోగి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఎమర్జెన్సీకి ఉదయం 6:30 గంటలకు చేరాడు. కానీ మధ్యాహ్నం వరకు అతడిని ఐసీయూలో చేర్చలేదు. లావేరు మండలం పోతయ్యవలసకు చెందిన కె.మల్లేశ్వరరావు పొలం గొడవల్లో కాలికి దెబ్బ తగిలి ఉదయం పది గంటలకు వచ్చినా చాలాసేపటి వరకు వైద్యం చేయలేదు.



స్ట్రెచర్ లేకపోవడంతో భుజంపై తన కొడుకును మోసుకుంటూ వెళ్తున్న తండ్రి

అమ్మో ఒంటి గంట దాటిపోయిందా..

- ఆస్పత్రిలో మధ్యాహ్నం ఒంటి గంటకు ముందే పనులు జరుగుతున్నాయి. పొరపాటున ఒంటి గంట దాటిపోతే అంతే సంగతులు.
- ఔట్‌పేషెంట్ రోగులకు స్కానింగ్ అవసరమైతే ఒంటిగంట లోగానే పూర్తి చేయించుకోవాలి.
- ఒంటి గంట తర్వాత అక్కడి టెక్నీషియన్లు వెయిటింగ్‌లో ఉన్న రోగులను మరుసటి రోజు రావాలని పంపించేస్తున్నారు.
- తర్వాతి రోజు స్కానింగ్ చేయించుకున్నా దాని రిపోర్టు తీసుకునేందుకు ఆ తర్వాతి రోజు రావాల్సి వస్తుంది.



మూలకు చేరిన అంబులెన్సులు

సర్వజన కష్టాలు



- మరుగుదొడ్లు 162 వరకు ఉన్నా 80 శాతం వరకు తాళాలు వేసి బిగించేశారు. మిగిలిన వాటిల్లో చాలా చోట్ల సింక్‌ల ట్యాప్‌లు, లావెట్రీల నుంచి వాటర్ రాక తీవ్ర ఇబ్బందిగా ఉంది.



- ఆస్పత్రిలో నిఘా వ్యవస్థ పూర్తిగా లోపించింది. సీసీ కెమెరాలు పాడైపోయినా బాగు చేయడం లేదు.

- ఆస్పత్రిలోని చిన్నపిల్లల నుంచి ఆస్పత్రిలో ఇన్‌పేషెంట్ వార్డుల్లో ఫ్యాన్లు పనిచేయక ఉక్కతో ఇబ్బంది పడాల్సి వస్తోంది.
- అలాగే ఐసీయూతో పాటు పలు భారీ మిషనరీ ఉన్న విభాగాల్లో కూడా ఏసీలు పని చెయ్యడం లేదు.



ఐసీయూలో పనిచేయని ఏసీలు



- ఆస్పత్రిలో ఉన్న ఆరు లిఫ్టుల్లో కేవలం ఒక్కటంటే ఒక్కటే పనిచేస్తోంది. తీరా ఇందులో కూడా వైద్య సామగ్రి, మందుల ప్యాకింగులను మాత్రమే పంపించేందుకు వినియోగిస్తున్నారు.



లిఫ్ట్ పనిచేయకపోవడంతో మెట్లు మార్గంలో కర్ర సాయంతో దిగుతున్న వృద్ధురాలు

- కొందరు సిబ్బంది తీరుపైనా విమర్శలు వినిపిస్తున్నాయి. నాలుగైదు ఓపీలు చూసేసి మిగిలినవి ట్రైనీలకు, వైద్య విద్యార్థులకు అప్పగించేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.



నేలపైనే బాలింతరాలు పాట్లు

ఆరు మందులకు రెండే ఇచ్చారు



స్త్రీల వ్యాధుల కోసం ఇక్కడకి వచ్చాను. డాక్టర్ గారు ఆరు మందులు రాసిస్తే కౌంటర్‌లో రెండే ఇచ్చి మిగిలినవి బయటకు కొనుక్కోమన్నారు. చాలా దూరం నుంచి వచ్చాను.ఇక్కడి డాక్టర్ రాసినవే ఇక్కడ దొరకక పోతే ఎలా.

– ఇందమ్మ, కొత్తూరు

ఓపీ చీటీ కోసం గంట బతిమలాడాను



కళ్లు చూపించుకుందామని ఉదయాన్నే కల్లా వచ్చాను. ఓపీ చీటీ కోసం ఫోను ఉందా అని అడిగారు. నా దగ్గర లేదు అంటే ఓపీ ఇవ్వలేమన్నారు. చాలా సేపు బతిమలాడితే ఇచ్చారు. ఓపీ చీటీల కోసం మాలాంటి వారికి ఇబ్బందిగా ఉంది.

– లక్కోజు అన్నపూర్ణ, గోరింట గ్రామం

మందులు లేవంటున్నారు



గుండె సంబంధిత సమస్య కోసం డాక్టర్ని కలిశాను. మందులు రాశారు. అయితే రాసిన మందులే పూర్తిగా ఇక్కడ ఇవ్వడం లేదు. ఇదేం ఆస్పత్రో ఏంటో..? బయట దుకాణాల్లో ఇవన్నీ చాలా ధర ఎక్కువ. ఇక్కడ అడిగితే లేవంటున్నారు. ఇది బాగోలేదు.

– నక్క దమయంతి, ఒప్పంగి

డెంగీ మృతిపై తూతూమంత్రంగా విచారణ



నిమ్మాడ కాలనీలో విచారణ చేస్తున్న జిల్లా మలేరియా సబ్‌యూనిట్ అధికారి కూర్మనాయకులు

కోటబొమ్మాళి: మండలంలోని నిమ్మాడ కాలనీకి చెందిన కొంచాడ నీలమ్మ మంగళవారం డెంగీ లక్షణాలతో మృతిచెందడంతో కలెక్టర్ స్పందించారు. సమగ్ర విచారణ చేపట్టాలని అధికారులకు బుధవారం ఆదేశాలు జారీ చేశారు. అయితే వైద్య సిబ్బంది తూతూమంత్రంగా గ్రామంలో విచారణ చేపట్టి నివేదికను కలెక్టర్‌కు అందజేసినట్లు తెలుస్తోంది. జిల్లా మలేరియా సబ్ యూనిట్ ఆధికారి కూర్మనాయకులు బాధితురాలి ఇంటికి వెళ్లకుండానే గ్రామంలో విచారణ చేసి వెళ్లిపోయినట్లు సమాచారం. జిల్లా మలేరియా అధికారి సత్యనారాయణ కూడా కేవలం నిమ్మాడ పీహెచ్‌సీ వైద్యులతో సెల్‌ఫోన్‌లో మాట్లాడి విచారణ చేపట్టినట్లు తెలుస్తోంది. వాస్తవానికి, డెంగీ లక్షణాలతో వ్యక్తి మృతి చెందితే వెంటనే గ్రామంలో రక్త పరీక్షలు చేయాలి. ఇక్కడ ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు వచ్చి వివరాలు సేకరించి వెళ్లిపోయారని స్థానికులు చెబుతున్నారు. రాష్ట్ర హెల్త్ అడిషనల్ డైరెక్టర్ నిమ్మాడ పీహెచ్‌సీ వైద్యులతో టెలి కాన్ఫరెన్సు నిర్వహించి వివరాలు సేకరించినట్లు పీహెచ్‌సీ వైద్యుడు సురేష్‌కుమార్ తెలిపారు.

క్లుప్తంగా

పారా మెడికల్ ఫలితాల్లో 'బొల్లినేని' ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ప్రతినిధులు

శ్రీకాకుళం రూరల్: బీఎస్సీ పారామెడికల్ డిగ్రీ ఫలితాల్లో రాగోలు జెమ్స్ ఆసుపత్రి బొల్లినేని మెడికల్స్ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచారని బొల్లినేని మెడిస్కిల్స్ సెంటర్ హెడ్ సీహెచ్ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ విడుదల చేసిన ఫలితాల్లో ఆప్టోమెట్రీ విభాగంలో వి.చిన్మయ, ఇమేజింగ్ టెక్నాలజీ విభాగంలో లీలామాధవి, ఫెర్ఫ్యూజన్ విభాగంలో ఎం.శ్రావ్య, డయాలసిస్ విభాగంలో వై.సుష్మభానోజీలు రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధించినట్లు పేర్కొన్నారు. అనస్తీషియా విభాగంలో గీతిక రెండో ర్యాంకు సాధించిందని తెలిపారు. వీరిని కళాశాల సిబ్బంది అభినందించారు. కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్ లక్ష్మీ పద్మజ, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

లాడ్జిలో వ్యక్తి ఆత్మహత్య

ఇచ్ఛాపురం: పట్టణంలోని శ్రీ లక్ష్మీసూర్యలాడ్జిలో విశాఖపట్నం జిల్లా ఆరిలోవ కాలనీకి చెందిన దొడ్డి మంగరాజు(47) అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలు మేరకు.. ఆరిలోవ కాలనీకి చెందిన మంగరాజు మద్యానికి బానిసయ్యాడు. ఎటువంటి ఉపాధి లేకుండా కుటుంబాన్ని పోషించలేక ఇబ్బందిపడేవాడు. వారి బంధువుల్లో ఒకరైన జగదీష్ భువనేశ్వర్‌లో ఉంటూ వ్యాపారం చేస్తున్నాడు. అతని వద్దకు పని కోసం మూడునెలల క్రితం వెళ్లాడు. ఈ క్రమంలో ఈ నెల 9న ఇచ్ఛాపురం వచ్చి లాడ్జిలో ఉంటున్నాడు. బుధవారం ఎంతసేపటికి గది తలుపులు తెరవకపోవడంతో సిబ్బంది యజమాని దృష్టికి తీసుకెళ్లారు. యజమాని ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు తలుపులు తెరిచి చూసేసరికి మంగరాజు ఫ్యాన్‌కు ఉరి వేసుకొని విగతజీవిగా కనిపించాడు. పట్టణ పోలీస్‌స్టేషన్ ఇన్‌చార్జి, రూరల్ ఎస్సై ఎస్.లక్ష్మణ్‌రావు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సీహెచ్‌సీకి తరలించారు.


చిన్ననీలావతిలో విషజ్వరాలు



జ్వరంతో బాధపడుతున్న దమయంతి

పలాస: మండలంలోని చిన్ననీలావతి గ్రామంలో ప్రజలు విషజ్వరాలతో బాధపడుతున్నారు. 15 రోజులుగా గ్రామంలో ఇదే పరిస్థితి నెలకొంది. కొందరు కాశీబుగ్గలోని ప్రైవేటు ఆసుపత్రుల, మరికొందరు విశాఖపట్నం వెళ్లి చికిత్స పొందుతున్నారు. విషయాన్ని సర్పంచ్ సాత్ర పద్మ స్థానిక ప్రభుత్వ వైద్య సిబ్బంది దృష్టికి తీసుకొని వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. అయితే మెరుగైన వైద్యం అందడం లేదని గ్రామానికి చెందిన పుచ్చ దుర్యోధన, గౌరకల బాలకృష్ణ తెలిపారు. ఆస్పత్రులు కాకుండా, ఒక్క గ్రామంలోనే ప్రస్తుతం 20 మంది వరకు జ్వరపీడితులు ఉన్నారు. ఈ విషయమై మండల వైద్యాధికారి సునీల్‌కుమార్ వద్ద ప్రస్తావించగా 30 మందికి జ్వరపీడితులు ఉన్నట్లు తెలియడంతో రక్తపరీక్షలు చేశామని, అందులో ఐదుగురికి విషజ్వరాలు ఉన్నట్లు గుర్తించి వైద్య సేవలు అందిస్తున్నామని చెప్పారు.

ఆర్టీసీ బస్సులు ప్రారంభం



బస్సులను ప్రారంభిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి: ఆర్టీసీకి చెందిన రెండు అల్ట్రా డీలక్స్ బస్సులను వ్యవసాయ శాఖ మంత్రి మంత్రి కె.అచ్చెన్నాయుడు బుధవారం కోటబొమ్మాళిలో జెండా ఊపి ప్రారంభించారు. పలాస-విశాఖపట్నం, శ్రీకాకుళం-విజయవాడ రూట్లకు ఈ బస్సులను కేటాయించినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు.

శక్తిపీఠాల దర్శనానికి పాదయాత్ర



స్వామీజీతో వీహెచ్‌పీ, ఆర్ఎస్ఎస్ సభ్యులు

ఇచ్ఛాపురం: భారతదేశాన్ని విశ్వగురువుగా తీర్చిదిద్దడమే ప్రధాన ఆశయమని నర్మదానంద స్వామీజీ అన్నారు. పాదయాత్రగా శక్తిపీఠాలన్నింటిని దర్శించుకునే క్రమంలో బుధవారం ఇచ్ఛాపురం విచ్చేసిన స్వామీజీకి విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) సభ్యులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ 2021లో మధ్యప్రదేశ్‌లోని ఓంకార్ జ్యోతిర్లింగానికి 70 కిలోమీటర్లదూరంలో ఉన్న జలపత్ గ్రామం నుంచి పాదయాత్రను ప్రారంభించినట్లు తెలిపారు. ఇప్పటి వరకు 14 రాష్ట్రాల మీదుగా 11 వేల కిలోమీటర్లు మేరకు పాదయాత్ర చేసి 15వ రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌లోకి అడుగుపెట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ అధ్యక్షుడు పాక తులసీదాస్, ఏ.సత్యం, ఏ.మోహన్, ఎస్.శ్రీనివాస్, సూర్యం, కుమార్, భజరంగదళ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

త్యాగాలకు సలాం



- నాటి స్వాతంత్ర్య స్ఫూర్తిని కొనసాగిస్తున్న సిక్కోలు
- గాంధీ మందిరాలు, స్మారక స్థూపాలు, స్మృతివనాల ఏర్పాటు
- పోరాటయోధులకు ఘన నివాళులు

స్వాతంత్ర్య పోరాటంలో సిక్కోలు సమరయోధుల పాత్ర చిరస్మరణీయం. గాంధీ వంటి మహాత్ముల పిలుపు మేరకు ఇక్కడ కూడా ఆంగ్లేయులకు వ్యతిరేకంగా పోరాటం సాగించారు. ఈ క్రమంలో జైలు జీవితాలు అనుభవించారు. వారి త్యాగాలను నేటికీ స్మరించుకుంటున్నారు. స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాలు, స్మారక స్థూపాలు, స్మృతివనాలు ఏర్పాటు చేసి వారి పోరాటాలను గుర్తు చేసుకుంటున్నారు.

విప్లవవీరుడు 'కిల్లి'



కిల్లి అప్పలనాయుడు

సరుబుజ్జిలి: స్వాతంత్ర్య ఉద్యమాల్లో చురుకైన పాత్ర పోషించిన వ్యక్తుల్లో సరుబుజ్జిలి మండలం పురుషోత్తపురం గ్రామానికి చెందిన కిల్లి అప్పలనాయుడు ఒకరు. సిక్కోలు గెడ్డపై అహంకారంతో విర్రవీగిన జమీందార్ల గుండెల్లో గుబులు పుట్టించిన విప్లవ వీరుడు. మహాత్ముడి పిలుపు మేరకు ఉప్పు సత్యాగ్రహం ఉద్యమంలో పాల్గొన్నారు. జాతీయ ఉద్యమంలో పాల్గొన్న నేరానికి నాటి బ్రిటీష్ ప్రభుత్వం 6-12-1942న అరెస్ట్ చేసి రాజమండ్రి, తంజావూరు, రాయవెల్లూరు సెంట్రల్ జైల్లో రెండేళ్లపాటు నిర్బంధించారు.

ఆ రోజులు మరువలేం

శ్రీకాకుళం కల్చరల్: బ్రిటీష్ పాలకుల కబంధ హస్తాలనుంచి పలువురి త్యాగాలు ఫలితంగా ఏర్పడిన భారత స్వాతంత్ర్యం ప్రతి భారతీయుడి మదిలో గుర్తుండిపోయే రోజు. దేశవ్యాప్తంగా పలువురు ఉత్సవాలు నిర్వహించగా, మరికొందరు స్వీట్లు పంచిపెట్టారు. నాటి కాలానికి చెందిన వారు ఇప్పటికీ ఆనాటి స్మృతులను గుర్తు చేసుకుంటూ ఉంటారు. వాటిలో కొన్ని..

ఎక్కడ చూసినా పోలీసులే..



ద్వారపు గోపాలరావు


స్వాతంత్ర్య వచ్చిన నాటికి నాకు 12 ఏళ్లు. ఆ సమయంలో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నాను. గాంధీజీ పిలుపు మేరకు ఉప్పు సత్యాగ్రహం కోసం కళింగపట్నం వెళ్లాను. ఎక్కడ చూసినా పోలీసులే. సామాన్యులు బయటకు రావాలంటే భయంగా ఉండేది. గాంధీ దూసి వచ్చినప్పుడు రైల్వేస్టేషన్‌కు వెళ్లి ప్రత్యక్షంగా చూడటం మరువలేను.

– ద్వారపు గోపాలరావు, రిటైర్డ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, ఎల్‌బీఎస్ కాలని, శ్రీకాకుళం

సిక్కోలులో గాంధీజీ



దూసి రైల్వేస్టేషన్ వద్ద ఆనాడు గాంధీ నాటిన మొక్క



మహాత్మా గాంధీ విగ్రహం

శ్రీకాకుళం కల్చరల్: మహాత్మాగాంధీ స్వాతంత్ర్యోద్యమం ముమ్మరంగా సాగుతున్న కాలంలో శ్రీకాకుళం జిల్లాలో కూడా పర్యటించారు. 1927 డిసెంబర్‌లో దూసి రైల్వే స్టేషన్‌లో దిగారు. శ్రీకాకుళం పురపాలక సంఘం ఆధ్వర్యంలో డిసెంబరు 2న పౌర సన్మానం జరిగింది. ఖద్దరు వస్త్రంపై రాసిన సన్మాన పత్రాన్ని మహాత్మాగాంధీకి అందజేశారు. దానిని అక్కడే వేలాం వేయగా నాటి ప్రముఖ న్యాయవాది వెంట్రాప్రగడ సూర్యారావు రూ.250కు కొనుగోలు చేశారు. అదే రోజు రాత్రి ఎంబాడ హనుమంతరావు పంతులు గారి ఇంట్లో బసచేశారు. తనను చూడడానికి వచ్చిన మహిళలకు హరిజనోద్ధరణలో భాగంగా మీ వద్ద ఉన్న ఆభరణాలు ఇవ్వాలని కోరగా మహిళలు నగలన్నీ విరాళంగా ఇచ్చేశారు. పొందూరు చేనేత కార్మికులు ఇచ్చిన సన్నఖాదీని చూసి మహాత్ముడు అబ్బురపడ్డారు.

త్యాగాలకు గుర్తుగా స్మారక స్థూపం

టెక్కలి: స్వాతంత్ర్య సంగ్రామంలో దేశ వ్యాప్తంగా జరిగిన అప్పటి ఉద్యమంలో టెక్కలి నియోజకవర్గంలో టెక్కలి, నందిగాం, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి మండలాలకు చెందిన స్వాతంత్ర్య సమరయోధులు తమ వంతు ఉద్యమ పాత్ర పోషించారు. టెక్కలికి చెందిన టంకాల రామన్న, తామాడ అప్పన్న, మోదుగువలసకు చెందిన రెయ్యి చంద్రయ్య, కోటబొమ్మాళి ఆర్.ఎస్.కు చెందిన టంకాల కృష్ణమూర్తి, టెక్కలికి చెందిన మలిపెద్ది కృష్ణమూర్తి, నౌపడకు చెందిన దుక్క సూర్యనారాయణరెడ్డి, టెక్కలికి చెందిన టంకాల సాంబమూర్తి, శివాల సుబ్బారావు, కంచ్రపీఠికి చెందిన అనంత మధుసూధన బెహరా, శివాల రామ్మూర్తి, శాసనాం గ్రామానికి చెందిన మల్లాది కృష్ణమూర్తి, మల్లాది వెంకటసూర్యనారాయణమూర్తి, నందిగాం మండలం పెంటూరు గ్రామానికి చెందిన అట్టాడ రామినాయుడు, టెక్కలి మండలం జెండాపేట గ్రామానికి చెందిన బి.ఎం.రెడ్డి, నౌపడకు చెందిన దుర్గాప్రసాద్ శతపతి తదితరు పోరాట యోధులు స్వాతంత్ర్య సమరంలో తమ వంతు పాత్ర పోషించారు. వీరి ఉద్యమానికి గుర్తుగా టెక్కలి మెయిన్ స్కూల్‌లో స్మారక స్థూపం ఏర్పాటు చేశారు.



సమరయోధుల పోరాటాలకు గుర్తుగా టెక్కలి మెయిన్‌స్కూల్‌లో ఏర్పాటు చేసిన స్మారక స్థూపం

తలస్నానాలు చేశాం..



మా తాతయ్య రైల్వేలో ఉద్యోగం చేసేటప్పుడు చక్రధర్‌పూర్‌లో ఉండే వాళ్లం. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని తెలుసుకుని చక్రధర్‌పూర్‌లోని పంపుహౌస్ చెరువులో మా కుటుంబ సభ్యులంతా కలసి తలస్నానాలు చేయడం ఇంకా గుర్తుంది. దేశానికి మైలు వదిలిందంటూ ఇలా స్నానాలు చేయించారు. అక్కడ రోజూ భజనాలు చేయడంతో పాటు ప్రసంగాలు వినడం మర్చిపోలేను.

– దూసి లక్ష్మీసోమనాథ్, దూసి గ్రామం, శ్రీకాకుళం

గాంధీ గుడి.. సమరయోధుల నిధి



స్మృతివనంలో 105 అడుగుల మువ్వన్నెల జెండా

శ్రీకాకుళం కల్చరల్: బాపూబాట అందరి బాటగా నాటితరం స్వాతంత్ర్య పోరాటయోధులు పోరాటం సాగించారు. లక్ష్య సాధన కోసం తన జీవితాన్నే ప్రయోగశాలగా మార్చుకున్న గాంధీ మహాత్ముడు అందరికీ ఆదర్శప్రాయుడు. అందుకే శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో ఆ మహనీయుడి కోసం ప్రత్యేక గుడిని నిర్మించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా శ్రీకాకుళం శాంతినగర్‌కాలనీలో గాంధీ స్మారక నిధి బృందం పర్యవేక్షణలో గాంధీ గుడి, స్వాతంత్ర్య సమరయోధుల స్మృతి వనం రూపుదిద్దుకుంది. పలువురు సామాజిక కార్యకర్తలు ఏకమై గుడి నిర్మాణానికి పూనుకోవడంతో దాతలు, అధికార యంత్రాంగం తోడ్పాటుతో 2021 జనవరి 30న గాంధీ గుడిని ప్రారంభించారు. అదే ప్రాంగణంలో స్వాతంత్ర్య పోరాటంలో త్యాగాలు చేసిన సమరయోధులతో పాటు ప్రపంచానికి ప్రభావితం చేసిన 40 మంది సంఘ సంస్కర్తల ప్రతి రూపాలను ప్రతిష్ఠించారు. గుడి పైభాగాన భరతమాతతో పాటు 15 అడుగుల గాంధీజీ ప్రతిరూపం దర్శనమిస్తుంది. గుడి మూలస్తంభాలపై హిందూ, ముస్లిం, క్రిస్టియన్ చిహ్నాలు గోచరిస్తాయి. గుడి నలుమూలలా గాంధీజీ జీవితంలో జరిగిన ముఖ్య ఘట్టాలు దర్శనమిస్తాయి. ఇక్కడే 105 అడుగుల ఎత్తులో జాతీయ జెండా ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.

నేడే జిల్లా ఆవిర్భావ దినోత్సవం

శ్రీకాకుళం కల్చరల్: కుతుబ్షాహీల పాలనలో 1687లో ఫౌజ్‌దారీ కేంద్రంగా చికాకోల్ ఏర్పాటైంది. దీని పరిధిలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ జిల్లాలు, ఒరిస్సాలోని కొన్ని ప్రాంతాలు ఉండేవి. 1758లో విజయనగరం జమీందారుల ఒత్తిడి మేరకు ఇంగ్లీష్ సైన్యం విశాఖలో అడుగుపెట్టింది. 1759లో ఫౌజుదారుల పాలనను అంతం చేసి బ్రిటీష్ పాలన మొదలైంది. 1759 జూలై 27న 'వైజాగ్‌పటం' పేరుతో జిల్లాగా ప్రకటించి విశాఖపట్నాన్ని కేంద్రంగా చేసుకున్నారు. ఇందులో ప్రస్తుత ఉత్తరాంధ్ర జిల్లాలతోపాటుగా ఒరిస్సాలోని గంజాం దక్షిణ భాగాన్ని కూడా చేర్చారు. 1801 నుంచి కలెక్టర్ల పాలన ప్రారంభమైంది. 1936లో ఉమ్మడి మద్రాసు – ఒరిస్సా రాష్ట్రాలను విభజించారు. 1950 ఆగస్టు 15న శ్రీకాకుళం జిల్లాగా ఏర్పడింది. అప్పటికి జిల్లా కలెక్టర్‌గా 'మిస్టర్ వైట్' ఉండగా.. కొత్తగా జిల్లా ఏర్పడిన వెంటనే జనాబ్ షేక్ అహ్మద్ తొలి కలెక్టర్‌గా నియమితులయ్యారు.

స్వాతంత్ర్య వేడుకలకు సిద్ధం



కవాతు రిహార్సల్స్ చేస్తున్న సాయుధ దళాలు

- ముస్తాబైన ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానం
- నేడు ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు ప్రదానం

శ్రీకాకుళం పాతబస్టాండ్ : స్వాతంత్ర్య వేడుకలకు శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానం ముస్తాబైంది. ఉదయం 8 గంటలకు వేడుకలు ప్రారంభం కానున్నాయి. జిల్లాకు చెందిన మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జేసీ, ఇతర అధికారులు హాజరుకానున్నారు. స్వాతంత్ర్య సమరయోధులకు సన్మానం, పోలీస్ పెరేడ్, సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రతి ఏడాదిలాగే ఈ సంవత్సరం కూడా ప్రభుత్వ శాఖల్లో ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు (అవార్డులు) అందజేయనున్నారు. ఈ ఏడాది 221 మంది ఉత్తమ ఉద్యోగులకు, మూడు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు అవార్డులు అందజేయాలని అధికారులు నిర్ణయించారు.

దివ్యాంగులకు కోసం 'స్వాభిమాన్'

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రతి నెల మూడో శుక్రవారం దివ్యాంగులకు ప్రత్యేక గ్రీవెన్స్‌సెల్(స్వాభిమాన్) నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు సలహా మేరకు ఇకపై ప్రతి నెలా మూడో శుక్రవారం స్వాభిమాన్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. దీనిలో భాగంగా ఆగస్టు 16న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో వినతులు స్వీకరిస్తామని, దివ్యాంగులు గమనించాలని కోరారు.

రెవెన్యూ సదస్సులపై విస్తృత ప్రచారం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: త్వరలో అన్ని గ్రామాల్లోనూ రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు, అందుకు తగ్గ ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహమ్మద్ ఖాన్, ఎస్పీ కె.వి.మహేశ్వర రెడ్డితో కలసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధానంగా మ్యూటేషన్, వెబ్‌ల్యాండ్ లో కరెక్షన్లు, 1బీ, దారి సమస్య, భూ తగాదాలు పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులను కూడా భాగస్వామ్యం చేయాలన్నారు. శ్రీకాకుళం, నరసన్నపేట, ఎచ్చెర్ల ఎమ్మెల్యేలు గొండు శంకర్, బగ్గు రమణమూర్తి ఎన్.ఈశ్వరరావు మాట్లాడుతూ గ్రామాల్లో ముందుగా దండోరా వేయించి రెవెన్యూ సదస్సుల ఆవశ్యకతను వివరించాలన్నారు. కార్యక్రమంలో వివిధ పార్టీల ప్రతినిధులు పి.ఎం.జె.బాబు, గోవిందరావు, బిర్లంగి ఉమామహేశ్వరరావు, రౌతు శంకర రావు, జిల్లా రెవెన్యూ అధికారి అప్పారావు, ఆర్డీఓలు సుదర్శన్ దొర, భరత్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బైక్‌పై వెళ్తూ కుప్పకూలి వ్యక్తి మృతి



ప్రాథమిక చికిత్స చేస్తున్న డాక్టర్ గంగా ప్రియదర్శిణి

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్లలోని ఆర్‌జీయూకేటీకి వెళ్లే దారిలో బుధవారం మధ్యాహ్నం బైక్‌పై వెళుతున్న ఓ వ్యక్తి ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. ఆ సమయంలో ఎచ్చెర్ల వైపు వెళుతున్న స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి గంగా ప్రియదర్శిణి స్పందించి ప్రాథమిక చికిత్స చేసి 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అనంతరం రిమ్స్‌కు తీసుకెళ్లి వైద్య సేవలు అందిస్తుండగా మృతి చెందాడు. ప్రాథమికంగా గుండెపోటు కారణమని భావిస్తున్నప్పటికీ.. శరీరంలో విషపు ఆనవాళ్లు ఉన్నాయని, గురువారం పోస్టుమార్టం రిపోర్టు వచ్చాక వివరాలు తెలుస్తాయని వైద్యులు చెబుతున్నారు. బాధితుడు లావేరు మండలం బుడుమూరు గ్రామానికి చెందిన కింతలి కోటేశ్వరరావు (రమేష్‌బాబు)గా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఈయన ఆర్‌జీయూకేటీలో పనిచేస్తున్నట్లు తెలిసింది.

శిశువు మృతితో ఆందోళన



ఆందోళన చేస్తున్న కుటుంబ సభ్యులు

ఇచ్ఛాపురం: వైద్యుడి నిర్లక్ష్యం కారణంగా తమ శిశువు మృతి చెందాడంటూ తల్లిదండ్రులు ఆరోపిస్తూ ఆందోళనకు దిగిన ఘటన బుధవారం ఇచ్ఛాపురం పట్టణంలో చేసుకుంది. శ్రీకాకుళం పట్టణానికి చెందిన శివప్రసాద్‌కు ఇచ్ఛాపురం పట్టణం కృష్ణసాగర్‌కు చెందిన త్రివేణి మహంతితో వివాహమైంది. త్రివేణి ఏడు నెలలుగా శ్రీకాకుళంలోని ఓ గైనకాలజిస్టు వద్ద ట్రీట్‌మెంట్ తీసుకోగా ఆమె ఈ నెల 4న డెలివరీ డేట్‌గా నిర్ణయించారు. ఇచ్ఛాపురంలో పుట్టింటికి వచ్చిన త్రివేణి స్థానిక కుతారి నర్సింగ్ హోమ్‌లో రిటైర్డ్ వైద్యుడు మోహన్‌దాస్ వద్ద ట్రీట్‌మెంట్ చేయించుకుంటున్నారు. ఈ నెల 5న డెలివరీ డేట్‌గా ఇచ్చినా నార్మల్ డెలివరీ కోసం జాప్యం చేయడంతో బుధవారం పురిటిలోనే మగశిశువు మృతిచెందాడని బాధిత కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఈ మేరకు మృత శిశువుతో ఆసుపత్రి ఎదుట ఆందోళనకు దిగారు. ఈ విషయమై వైద్యుడు స్పందిస్తూ గర్భంలోనే శిశువు మృతిచెందిందని, ఈ విషయంలో తమను తప్పుపట్టడం సరికాదన్నారు.

యోగా కోర్సుల్లో ప్రవేశాలకు గడువు పెంపు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో యోగా కోర్సుల్లో ప్రవేశాల దరఖాస్తుల స్వీకరణకు గడువు ఈ నెల 31 వరకు పెంచినట్లు రిజిస్ట్రార్ పి.సుజాత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. యోగా అండ్ ఫిట్‌నెస్ మేనేజ్ మెంట్ విభాగం ఆధ్వర్యంలో ఆరు నెలలు నిడివి గల డిప్లమా కోర్సు, ఏడాది పీజీ డిప్లమా కోర్సు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దరఖాస్తు రుసుం రూ.500గా నిర్ణయించామని, వర్సిటీ విద్యార్థులకు 30 శాతం రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు. వివరాలకు బీఆర్‌ఏయూ.ఈడీయు.ఇన్ వెబ్‌సైట్ సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు

శ్రీకాకుళం రూరల్/ఎచ్చెర్ల క్యాంపస్: సింగుపురం జాతీయ రహదారి వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఫరీద్‌పేటకు చెందిన సత్తారు నాగరాజు జ్యోతి దంపతులు టెక్కలి వైపు వెళ్తుండగా అదే మార్గంలో టెక్కలి వైపు వెళ్తున్న ప్రైవేట్ బస్సు ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. మహిళకు తీవ్ర గాయాలు కావడంతో 108 అంబులెన్సులో రిమ్స్‌కు తరలించారు.

ఎచ్చెర్ల క్యాంపస్: ఫరీదుపేట కూడలి కొయ్యరాళ్ల వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆర్తకోట్ల కామరాజు అనే విద్యార్థి గాయపడ్డాడు. విశాఖపట్నం ఆంధ్రా విశ్వవిద్యాలయంలో పోస్టు గ్రాడ్యుయేషన్ చదువుతున్న ఈ విద్యార్థి శ్రీకాకుళం వైపు బైక్‌పై వస్తున్నాడు. స్వగ్రామం తండేవలస వచ్చే క్రమంలో వెనుక నుంచి కారు ఢీ కొట్టింది. ఈ ఘటనలో గాయపడిన కామరాజును శ్రీకాకుళం రిమ్స్‌లో చేర్పించారు. ఎచ్చెర్ల పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

టెక్కలి రూరల్: పరశురాంపురం జంక్షన్ సమీపంలో జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రేగిడి మండలం ఉంగరాడ గ్రామానికి చెందిన చల్ల విశ్వనాథం గాయపడ్డాడు. ద్విచక్రవాహనంపై టెక్కలి వైపు వస్తుండగా డివైడర్‌ను ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. క్షతగాత్రుడిని టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమంగా మారడంతో శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేశారు. ఈ ఘటనపై టెక్కలి పోలీసులు వివరాలు సేకరించారు.

ప్రెసిడెంట్ మెడల్‌కు ఎంపిక



కప్పల శ్యామ్‌గుణ

కంచిలి: మండలంలోని కేసరపడ గ్రామానికి చెందిన కప్పల శ్యామ్‌గుణ ఆర్మీలో సుబేదార్ మేజర్‌గా సేవలందిస్తున్నారు. 78వ స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా 'హానరీ కెప్టెన్'గా రాష్ట్రపతి చేతులమీదుగా మెడల్ అందుకోవడానికి ఎంపికయ్యారు. ప్రస్తుతం ఈయన అసోం రాష్ట్రం గౌహతిలో 73 మీడియం రెజిమెంట్ క్యాంప్‌లో విధులు నిర్వర్తిస్తున్నారు. గురువారం ఎర్రకోటలో రాష్ట్రపతి చేతులమీదుగా మెడల్‌ను అందుకోనున్నారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యురాలు ఇప్పిలి లోలాక్షి, కేసరపడ సర్పంచ్ కప్పల చంద్రమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు మెండ హైమావతి, వైఎస్సార్ సీపీ నేతలు కప్పల యుగంధర్, మెండ ప్రకాశ్, మెండ మురళీనాయుడు అభినందించారు.